క్లుప్తంగా

చెక్కులు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మంగళవారం ఆయన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని 11, 22వార్డుల్లో సీసీరోడ్లు, కల్వర్టు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, తహసీల్దార్ జ్యోతి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమిని కాపాడాలని వినతి

లక్సెట్టిపేట: మండలంలోని గంపలపల్లి గ్రామ చెరువు భూమిని కాపాడాలని మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందించారు. చెరువు భూమి ఆక్రమణకు గురవుతుందని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు శిఖం భూమి కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తూ, చెరువులో గుంతలుగా చేస్తున్నారని వాపోయారు. రికార్డు ప్రకారం చెరువు భూమిని కేటాయించి, హద్దులు వేయించాలని కోరారు. కార్యక్రమంలో అంజన్న, తిరుపతి, రాజమల్లు, వెంకటేష్, సత్తయ్య, మల్లయ్య, లింగయ్య పాల్గొన్నారు.

బోదకాలు నివారణపై అవగాహన



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్

జైపూర్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నట్టల నివారణ, బోదకాలు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వో రామ్మూర్తి, సబ్‌యూనిట్ అధికారి నాందేవ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకులం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలభాస్కర్, కేజీబీవీ స్పెషల్ అధికారి ఫణిబాల, హెచ్‌వీ వాసుమతి, ఏఎన్‌ఎం మల్లీశ్వరి, హెచ్‌ఏ మల్లేశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 06న గురువారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సర్వీస్ అడ్వైజర్లు, డెంటర్స్, పెయింటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు బీటెక్, డిప్లొమా అర్హత కలిగిన 18–40 ఏళ్లలోపు వారు హాజరుకావాలన్నారు.

కిష్టంపేటలో సమావేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

చెన్నూర్‌రూరల్: గ్రామాల్లో బహిరంగ మల విసర్జన చేయకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ గ్రామస్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మండలంలోని సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుకు ఎంపికైన కిష్టంపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ వీవో సంఘాల మహిళలు ఉన్నారు.

ప్రమాదబీమా పరిహారం అందజేత



తాండూర్: రోడ్డు ప్రమాదానికి గురై అకాల మృతి చెందిన తాండూర్ మండల బీఆర్‌ఎస్ కార్యకర్త నాయిని రమేష్ కుటుంబానికి రూ.2లక్షల ప్రమాద బీమా పరిహారం చెక్కును ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దత్తుమూర్తి, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య పాల్గొన్నారు.

మట్టి తోడేస్తున్నారు..!

మట్టి దందా జోరుగా సాగుతోంది. రోజువారీగా ఎక్కడ పడితే అక్కడ మట్టిని తోడి అమ్మకాలు చేస్తున్నారు. నీటి పారుదలశాఖ నిబంధనలకు పాతరేసి రేయింబవళ్లు ట్రాక్టర్లలో లోడ్ చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. నిత్యకృత్యంగా సాగుతున్నా మట్టి దందాను నివారించే ప్రభుత్వ అధికారులు కరువయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఈ దుస్థితిపై కథనం..



- దర్జాగా చెరువు, గుట్ట మట్టి అక్రమరవాణా | నిబంధనలు పాటించని అక్రమార్కులు | పట్టించుకోని అధికారులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ శివారు ప్రాంతంలో ఉన్న పోచమ్మ చెరువు మట్టి అక్రమార్కుల పాలవుతోంది. చెరువు శిఖం, ఎత్తుగా ఉన్న చిన్నపాటి మట్టి గుట్టలను తోడేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి రవాణా జరుగుతోంది. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ప్రభుత్వ, సింగరేణి భూముల్లో స్థిరనివాసాలు కట్టుకున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించడం, దరఖాస్తులు స్వీకరించి అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను పంపిణీ చేస్తుండటంతో పాత ఇళ్ల స్థానంలో కొత్త ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇదే అవకాశంగా తీసుకుని ట్రాక్టర్ల యజమానులు మట్టిదందాకు తెరలేపారు. బెల్లంపల్లి బజారు ఏరియాకు అరకిలో మీటరు దూరంలో ఉన్న పోచమ్మ చెరువు మట్టిని తోడేసి ఎంచక్కా పట్టుకెళ్తున్నారు. మట్టి తవ్వకాలతో చెరువు శిఖం మరింత లోతుగా మారగా, శిఖం భూమిని ఆనుకుని ఉన్న మట్టి గుట్టను సైతం పెకిలించి పట్టుకెళ్తున్నారు. మట్టి తవ్వకాలతో గుట్ట క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

నిబంధనలు బేఖాతరు...

ప్రభుత్వ భూమితో పాటు చెరువు, కుంటలు ఇతర జలాశయాల నుంచి మట్టిని తోడటానికి తప్పనిసరిగా నీటి పారుదల శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా చెరువు మట్టిని తోడినా, అక్రమంగా రవాణా చేసినా నేరమవుతుంది. ఇందుకు మట్టిని తోడేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయి. మరోపక్క మట్టిని రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసే నిబంధనలు ఉన్నాయి. జరిమానా విధించడంతో పాటు జైలుకు పంపే అవకాశాలు ఉండగా అక్రమార్కులు అదేమీ పట్టించుకోవడం లేదు. దర్జాగా మట్టి తవ్వకాలు చేస్తూ అక్రమంగా రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

చెరువులో ఎలాంటి తవ్వకాలు చేపట్టకుండా, మట్టిని తోడకుండా, అక్రమంగా రవాణా చేయకుండా కట్టడి చేయాల్సిన నీటి పారుదలశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. రేయింబవళ్లు మట్టిని తోడి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నా కట్టడి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖలు సైతం అదే దోరణిని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ కారణంగానే అక్రమార్కులకు మట్టిదందా కాసుల వర్షం కురిపిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా చెరువు నుంచి మట్టిని తవ్వి తీసుకెళ్లడం చట్టరీత్యానేరం. అక్రమంగా మట్టిని తీసుకెళ్తున్న వ్యక్తులకు జరిమానా విధించి కేసు నమోదు చేయొచ్చు. ఇప్పటికైనా అక్రమార్కులు వెంటనే మట్టి దందాను స్వచ్ఛందంగా ఆపాలి. లేకపోతే తగిన చర్యలకు బాధ్యులవుతారు. ఇకపై మట్టిని తోడి తీసుకెళ్లకుండా పర్యవేక్షణ చేసి నివారిస్తాం.

– నరేన్ కుమార్, డీఈ, నీటి పారుదలశాఖ, బెల్లంపల్లి

చెన్నూరులోనూ మట్టి దందా

- రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు



చెన్నూర్ శనిగకుంట నుంచి మట్టిని తరలిస్తూ..

చెన్నూర్: మున్సిపాలిటీలో నూతనంగా ఇంటి నిర్మాణాలు జోరుగా సాగుతుండగా, దీనికి తోడు అక్రమ మట్టి దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు రాత్రి వేళల్లో చెరువులు, కుంటలు అడ్డాగా చేసుకొని జేసీబీల సాయంతో ట్రాక్టర్లలో మట్టిని తరలించి లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు నిర్వహించి చెరువులు, కుంటలను ధ్వంసం చేస్తున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని శనగకుంట, చిట్టూరికుంట మండలంలోని కన్నెపల్లి, కిష్టంపేటలలో మట్టితో పాటు మొరం దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అనుమతి ఇవ్వలేదు..

మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమ మట్టి వ్యవహారంపై నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

– బాలు, భూగర్భ గనుల శాఖ ఏడీ

చర్యలు తీసుకుంటాం.

చెన్నూర్‌తో పాటు మండలంలోని చెరువులు, కుంటల్లో మట్టి తవ్వకాలు చేపట్టేందుకు దరఖాస్తులు రాలేదు. ఇప్పటివరకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాల్, ఇరిగేషన్, ఏడీ

దొడ్డి కొమురయ్య వర్ధంతి



భీమారం: నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: దొడ్డి కొమురయ్య వర్ధంతిని జిల్లా కేంద్రంలో బీసీ జాగృతి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్ మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కొమురయ్య చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి పట్టణ ఉపాధ్యక్షుడు సత్తయ్య, సూరయ్య, హిమ్మత్‌సింగ్, పట్టణ కార్యదర్శి రవి, శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తిరుపతి, మల్లేశ్, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని, పెన్షన్లను మొదటి తేదీనే ఇచ్చి, పెండింగ్ బిల్లుల బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరుతూ పెన్షనర్ల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ట్రెజరర్ శాఖ ఏటీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ.. పెన్షనర్ల కమ్యూటేషన్‌ను 15నుంచి 12సంవత్సరాలకు కుదించాలని, నగదు రహిత వైద్య చికిత్సలను అందించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి చక్రధర్ రావు, కార్యదర్శి కెఎంఎస్ రెడ్డి, పాండురంగ, కరుణానందం, అశోక్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం...?

- అడ్డుకున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 8వ వార్డు రంగంపేట్ ఆండాళమ్మ కాలనీలో గల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు మంగళవారం చేసిన ప్రయత్నాన్ని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు, అందులోనూ ఓ ప్రజాప్రతినిధి భర్త ఈ తతంగాన్ని నడిపిస్తుండడంతో కాలనీ వాసులు 2021లోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు గతంలోనే సర్వే చేసి, ప్రభుత్వ భూమిగా తేల్చగా, కాలనీవాసులకు, కబ్జాలో ఉన్న వారికి మధ్య గత కొన్నాళ్లుగా వివాదం జరుగుతోంది. కొందరు కాలనీకి చెందిన అధికార పార్టీ నాయకులను మచ్చిక చేసుకని, అదే భూమిలో మంగళవారం ఉదయం నుంచే షెడ్డు నిర్మించే పనులను ప్రారంభించగా, స్థానికులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో కట్టడాలకు అనుమతి లేదని పనులను అడ్డుకోగా, సరైన ధ్రువీకరణ పత్రాలు కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు తీసుకోకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ కట్టిన వాటిని కూల్చేశారు. ఈ విషయమై మంచిర్యాల డిప్యూటీ తహసీల్దార్ అంజలిని వివరణ కోరగా.. 131సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తున్నట్లు తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు, వారి భూమి కాగితాలను రెవెన్యూ కార్యాలయంలో అందించాలని చెప్పి పనులను నిలిపి వేయించామని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సత్యనారాయణను వివరణ కోరగా మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా, మున్సిపల్ అనుమతులు ఉండాలని, అక్రమంగా నిర్మాణాలు చేస్తే, వాటిని కూల్చివేసి, మున్సిపల్ చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



రామకృష్ణాపూర్‌లో బైక్ ర్యాలీ



హాజీపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మందమర్రిరూరల్/తాండూర్/వేమనపల్లి/భీమిని: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం బూత్ సమ్మేళనాలు, మండల స్థాయి కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. పలు మండలాల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. పలు ప్రధాన కూడళ్లలో మోటార్ బైక్ ర్యాలీ చేపట్టారు. తెలంగాణలో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో రామకృష్ణాపూర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, యాదగిరి, హాజీపూర్‌లో మండల ఇన్‌చార్జి విస్తారక్ వరగంతం రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి సత్యం, మందమర్రిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, విస్తారక్ శ్రీకాంత్, తాండూర్‌లో మండల బీజేపీ విస్తారక్ బండారి పవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ, వేమనపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్, విస్తారక్ బీజేవైఎం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ పటేల్, భీమినిలో బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



చెన్నూర్/వేమనపల్లి: మంథని నుంచి చెన్నూర్‌కు వచ్చే 132కేవీ రెండో లైన్ నిర్మాణంలో భాగంగా బుధవారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు చెన్నూర్, భీమారం, కోటపల్లి, వేమనపల్లి నాలుగు మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్సీ శేషగిరిరావు, డీఈఎంఎం కైసర్, ఏడీఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

‘విచారణ పూర్తయ్యేవరకు ఆసుపత్రిని బంద్ చేస్తాం’

బెల్లంపల్లి: శిశువు మృతి ఘటనకు సంబంధించి విచారణ పూర్తయ్యేవరకు ఆసుపత్రిని స్వచ్ఛందంగా మూసి ఉంచుతామని బెల్లంపల్లి నిత్య పిల్లల ఆసుపత్రి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. శిశువు మృతి ఘటనలో వైద్యుడి నిర్లక్ష్యం లేదని తెలిపారు. పోలీసు, వైద్యశాఖ అధికారుల విచారణకు సహకరిస్తున్నామని తెలిపారు. వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకొచ్చిన శిశువుకు తమ వద్ద ఉన్న సౌకర్యాలతో చికిత్స చేశామని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హయ్యర్ సెంటర్‌కు రెఫర్ చేశామని, అక్కడ శిశువు చనిపోయాడని, అందులో డాక్టర్ నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారని వివరించారు. ఆయా శాఖల విచారణలో వాస్తవాలు వెల్లడవుతాయని, కానీ కొంతమంది బ్లాక్ మెయిలింగ్, బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. విచారణలో తాము తప్పు చేసినట్లు తేలితే చట్ట రీత్యా తీసుకునే ఎలాంటి చర్యలకైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

శ్రీరాంపూర్: సీజనల్ వ్యాధులపై ఉద్యోగుల కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్ రెడ్డి తెలిపారు. ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై మంగళవారం నిర్వహించిన వైద్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో అపరిశుభ్ర వాతావరణం, దోమలు, ఈగలు వల్ల అనేక వ్యాధులు వస్తాయన్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా, వాంతులు, విరోచనాలు, జ్వరం వంటివి ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంతోష్ కుమార్, ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, అధికారులు చంద్రమౌర్య, మర్రి రమేష్, ప్రేమ్ కుమార్, అరుణ్ కుమార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై అవగాహన..

ఎస్సార్పీ 3, 3ఏ గనిపై రక్షణపై అవగాహన కల్పించారు. ‘నా భద్రత నా బాధ్యత... నా భద్రతే నా కుటుంబ భద్రత’ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనేజర్, సేఫ్టీ అధికారి రక్షణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గని, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

యోగా శిక్షకులు కావలెను

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించే యోగా తరగతులకు శిక్షణ ఇవ్వడానికి అర్హులైన శిక్షకులు కావాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షకులుగా దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 10లోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో వారి దరఖాస్తు ఇవ్వాల్సిందిగా సూచించారు. సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు జత చేయాలన్నారు.

వేతనాల చెల్లింపుల్లో జాప్యం?

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రాణహిత అతిథి గృహంలో సింగరేణి అధికారులకు అన్నిరకాలుగా సేవలందించే కార్మికులకు వేతన కష్టాలు తప్పడం లేదు. రెండు, మూడు నెలలకోసారి వేతనాలు చెల్లిస్తుడడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూపర్‌వైజర్లతో కలిపి 25మంది పని చేస్తుండగా, సంబంధిత కాంట్రాక్టర్ రెండు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదని వాపోయారు. పీఎఫ్‌ల చెల్లింపులలో కూడా కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు దోరణితోనే వ్యవహరిస్తున్నట్లుగా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి మణుగూరుకు బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావును మంగళవారం జీఎం సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి/తాండూర్: ప్రజా సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ విమర్శించారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట, తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. పోడుభూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలివ్వాలని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రభుత్వ జూనియర్ డిగ్రీ, జూనియర్ కళాశాలలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు.

సీఎంపీఎఫ్ అమలు చేయాలి

- జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ అమలు చేయాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సివిల్ కాంట్రాక్టర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ అమలు చేయాలని న్యాయస్థానం నుంచి సింగరేణికి ఆదేశాలున్నాయని తెలిపారు. ఈ మేరకు సంస్థ ఆదేశాలకు అనుగుణంగా కాంట్రాక్టర్లు అందరూ తమ వద్ద పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్‌ను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రఘుకుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవింద్‌రావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, డెప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సంక్షేమ అధికారి శంకర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ భవాని పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

జైపూర్/దండేపల్లి/మందమర్రిరూరల్/బెల్లంపల్లి: వరుణుడు కరుణించాడు. విత్తనాలు విత్తుకుని వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నకు సంతోషాన్నిచ్చాడు. జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. దాదాపు గంట వరకు వర్షం పడటంతో వరదనీరు రోడ్లపై ప్రవహించింది. లోతట్టుప్రాంతాల్లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

సంక్షిప్త వార్తలు

జీపీ కార్మికుల సమ్మె నోటీసు

దండేపల్లి: సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు ఈ నెల 6 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ఎంపీవో సత్యనారాయణకు మంగళవారం సమ్మె నోటీసు అందించారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

బెల్లంపల్లి: అనుమతి లేకుండా బెల్లంపల్లిలో నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీచైతన్య ప్రైవేట్‌పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు.

‘అందుబాటులో ఉండి సేవలందిస్తా’

జన్నారం: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని రేండ్లగూడ, పొనకల్, గొందుగూడలో మంగళవారం పర్యటించారు.

టిపుల్ ఐటీలో సీటు

భీమిని: కన్నెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పుల్లూరి వైష్ణవి, రాచకొండ సంజన ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు సంజీవ్ పేర్కొన్నారు.

ఫీజుల నియంత్రణపై చర్చ

మంచిర్యాలఅర్బన్: డీఈవో యాదయ్యను భారత జాగృతి బాధ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో ఫీజుల నియంత్రణపై చర్చించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పాతమంచిర్యాల: ప్రభుత్వ శాఖల్లో వృత్తి పనులు నిర్వహించుకునేలా జీవో జారీ చేసినందుకు రజక సొసైటీ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మెరిట్ సర్టిఫికెట్ అందజేత

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి అందించడానికి నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఇందుకు గాను రాష్ట్ర గవర్నర్ తమిళి సై నుంచి వచ్చిన వెండి పతకం, మెరిట్ సర్టిఫికేట్‌ను మంగళవారం రెడ్‌క్రాస్ సభ్యులు నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావుకు అందించారు.

మోస్ట్ వైశ్య పాపులర్ మెన్ అవార్డు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన మోస్ట్ వైశ్య పాపులర్ మెన్ లైమ్ లైట్ అవార్డును మంచిర్యాలకు చెందిన సామాజికవేత్త రాచకొండ నాగేశ్వర్‌రావు అందుకున్నారు. 75మంది పోటీ పడగా 3,044ఓట్ల మెజారిటీని సాధించి ఈ అవార్డును దక్కించుకున్నారు.